సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



ఉన్నత స్థాయికి ఎదగాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని భువనగిరి కలెక్టర్ హనుమంతరావు అన్నారు.

- 8లో



డ్రోన్ సేవలు విస్తరింపజేస్తాం

క్షయ వ్యాధిగ్రస్తుల వైద్యం కోసం డ్రోన్ సేవలు విస్తరింపజేయనున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు.

- 8లో



ఆలేరును సస్యశ్యామలం చేస్తా

ఆలేరు నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపి సస్యశ్యామలం చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు.

- 9లో

న్యూస్‌రీల్

కేంద్ర బృందం సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బీబీనగర్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు అవుతున్న కార్యక్రమాల గురించి తెలుసుకునేందుకు గురువారం బీబీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి జ్ఞానేష్ భారతి, డైరెక్టర్ భాస్కర్ సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, ప్రీస్కూలు నిర్వహణ తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారివెంట డీడబ్ల్యూఓ నర్సింగ్‌రావు, సీడీపీఓ శైలజ, సూపర్‌వైజర్స్ కరుణ, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు రజిత, విజయలక్ష్మి ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి : డీసీపీ



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

గుండాల: విధి నిర్వహణలో పోలీసులు అంకితభావంతో పనిచేయాలని డీసీపీ రాజేష్‌చంద్ర అన్నారు. గురువారం గుండాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో ప్రతి సంవత్సరం సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశామన్నారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ కొండల్‌రావు, ఎస్ఐ జి.సైదులు, ఏఎస్ఐ శ్రీనివాస్, జమేదార్ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

యాదగిరిగుట్ట క్షేత్రంలో సంప్రదాయ పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన వంటి పూజలు చేపట్టారు. తర్వాత ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలను భక్తులచే నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు భక్తులచే జరిపించారు. సాయంత్రం వేళ వెండి జోడు సేవలను మాఢ వీధిలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

భువనగిరి టౌన్: నేటి బాలలను రేపటి పౌరులని, వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. గురువారం భువనగిరి కలెక్టరేట్‌లోని బాల సదనంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ బాలల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ మతి బండారు జయశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్ సిబ్బంది, అధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

చౌటుప్పల్‌లో వాహనాల రద్దీ

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణం గురువారం వాహనాల రద్దీతో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఒకవైపు హైవే, మరోవైపు సర్వీస్ రోడ్లు పూర్తిగా స్తంభించాయి. వివాహాది శుభకార్యాలతోపాటు వరుస సెలవుల నేపథ్యంలో ప్రజలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుండడంతో చౌటుప్పల్ పట్టణంలో వాహనాల రద్దీ ఏర్పడింది. దీనికితోడు పట్టణంలో శ్రీకంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు జరుగుతుండడం.. మరోవైపు సర్వీస్‌రోడ్ల మరమ్మతులు, డ్రెయినేజీ పనులు కొనసాగుతుండడంతో ట్రాఫిక్ జామ్ అయ్యి జనం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



చౌటుప్పల్‌లోని సర్వీస్ రోడ్డులో నెలకొన్న రద్దీ



చౌటుప్పల్‌లోని జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

పత్తికి మద్దతు ఏది!



మోటకొండూరు మండల పరిధిలోని శ్రీగాయత్రి కాటన్ మిల్లుకు పత్తి లోడ్‌లతో వచ్చిన వాహనాలు

కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయి

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయి. 8 శాతం తేమ ఉన్న పత్తికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇస్తున్నాం. బిల్లుల చెల్లింపులు వేగవంతం చేశాం. సోమవారం వరకు పెండింగ్ బిల్లులు రైతుల ఖాతాల్లో జమ చేస్తాం. తేమశాతం తక్కువ ఉండేలా రైతులు పత్తిని ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలి.

– సబిత, జిల్లా మార్కెటింగ్ అధికారి, యాదాద్రి భువనగిరి జిల్లా

- తేమ సాకు చూపుతూ తక్కువ ధర చెల్లిస్తున్న వ్యాపారులు
- తరుగు పేరుతో అదనంగా ఐదు కిలోల వరకు తూకం
- క్వింటాకు రూ.400 వరకు కోత
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న మార్కెటింగ్ అధికారులు
- చిత్తవుతున్న పత్తి రైతులు



ఈ ఫొటోలో ఉన్న రైతు మోటకొండూరు మండలం కాటేపల్లికి చెందిన కానుగంటి నర్సింహ. ఈయన 10 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకముందు 60 క్వింటాళ్ల పత్తిని తమ సొంత మండలంలో ఉన్న శ్రీగాయత్రి కాటన్ మిల్లుకు తీసుకెళ్లి రూ.7 వేల నుంచి రూ.7,250 వరకు విక్రయించారు. ప్రస్తుతం తన వద్ద ఉన్న 40 క్వింటాళ్ల పత్తిని విక్రయించడానికి అదే మిల్లులో ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు.

జిల్లాలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలు 12	ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,521
రైతుకు దక్కుతున్న ధర రూ.7,100 నుంచి 7,400	ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పత్తి 61,058 క్వింటాళ్లు

సాక్షి, యాదాద్రి: తెల్లబంగారం పండించిన రైతులకు మద్దతు ధర అందడం లేదు. దీంతో ఈ ఏడాది కూడా లాభాలు లేనట్టునని రైతుల వాపోతున్నారు. దళారులు, మిల్లుల యజమానులు కుమ్మక్కై తేమ శాతం పేరుతో కొర్రీలు పెడుతూ ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. వారు కొన్న పత్తిని జిల్లా వ్యాప్తంగా 12 చోట్ల జిన్నింగ్ మిల్లుల వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముతూ మద్దతు ధర పొందుతున్నారు. కానీ తమకు మాత్రం కేవలం సాగు పెట్టుబడులు పూడుతున్నాయి తప్ప తాము చేసిన కష్టానికి ఫలితం లేకుండా పోయిందని పత్తి రైతులు పేర్కొంటున్నారు. ఇంత జరుగుతు న్నా మార్కెటింగ్ శాఖ అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేచీ పెడుతూ.. ధర తగ్గిస్తూ..

మిల్లుల వద్దకు పత్తిని అమ్మకానికి తెచ్చిన రైతులకు కొర్రీలు తప్పడంలేదు. క్వింటాకు మద్దతు ధర రూ.7,521 చెల్లించాల్సి ఉండగా పత్తి గింజ బాగాలేదని, తెలుపు నుంచి రంగు మారిందని, నాణ్యత లేదని, పరుగు పట్టిందని, తేమ శాతం ఎక్కువగా ఉందని పేచీ పెడుతున్నారు. క్వింటాకు రూ.7,100 నుంచి రూ.7,300 వరకు చెల్లిస్తున్నారు. కొన్ని మిల్లుల్లో అంతకంటే తక్కువకే పత్తిని కొంటున్నారు. తేమ శాతం 12 నుంచి 15 శాతం ఉందని ప్రతి క్వింటాకు నాలుగు నుంచి ఐదు కిలోల పత్తిని అదనంగా తూకం వేసుకుంటున్నారు. అదనంగా తూకం ఎందుకు వేస్తున్నారని, అలాగే తరుగు పేరుతో కోత ఎందుకు పెడుతున్నారని ప్రశ్నిస్తే ఆరబెట్టి తీసుకురావాలని రిజెక్ట్ చేస్తున్నారు. దీంతో చేసేది లేక రైతులు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఫలితంగా క్వింటా పత్తి మీద ఒక్కో రైతు రూ.200 నుంచి రూ.400 వరకు నష్టపోతున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా 12 జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో ఈనెల 13 వరకు 2,963 మంది రైతుల నుంచి 61,058 క్వింటాళ్ల పత్తిని కొన్నారు.

పది రోజులైనా అందని బిల్లులు

కొనుగోలు చేసిన పత్తి బిల్లులు పదిరోజులైనా రైతులకు అందడంలేదు. మోత్కూరు, చౌటుప్పల్, ఆలేరు, భువనగిరి, వలిగొండతోపాటు దాదాపు అన్నిచోట్ల పత్తి బిల్లుల చెల్లింపు ఆలస్యం అవుతోంది. మార్కెట్ కమిటీల నుంచి రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో మహబూబ్‌నగర్ సీసీఐ బ్రాంచ్‌కు పంపించాలి. ఆయా బిల్లులకు చెందిన రశీదులు మహబూబ్‌నగర్‌లోని సీసీఐ అధికారులకు మార్కెట్ అధికారులు పంపిస్తే వారు పరిశీలించి తర్వాత ఆ మొత్తాన్ని రైతులకు ఖాతాల్లో జమచేస్తారు. ఇది కూడా మహారాష్ట్రలోని ముంబైలో గల పత్తి కేంద్ర కార్యాలయానికి వివరాలు పంపిన తర్వాత డబ్బులు విడుదల చేస్తారు. అయితే మార్కెట్ అధికారుల జాప్యం వల్ల సకాలంలో బిల్లులు రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ అర్జీలపై దృష్టిపెట్టాలి

- కలెక్టర్ హనుమంతరావు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి, యాదాద్రి: ధరణి మాడ్యూల్స్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో జిల్లా రెవెన్యూ, డివిజనల్ అధికారులు, తహసీల్దార్లతో భూ సంబంధిత, కోర్టు కేసులు, ఓటర్ సవరణ, ధరణి, యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్, ప్రజాపాలన తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ యంత్రాగం ప్రధాన భూమిక పోషించాలన్నారు. ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఎన్ని పరిష్కరించారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఆరా తీశారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, మీ సేవలో ఉన్న దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటర్ నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫామ్–6, 7, 8 దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్‌లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

16న డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాక

భువనగిరి టౌన్: బీసీ రిజర్వేషన్ల పెంపుపై ప్రజా అభిప్రాయ సేకరణ నిమిత్తం డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరావు, సెక్రటరీ బి.సైదులు ఈనెల 16న నల్లగొండకు రానున్నారని కలెక్టర్ హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్ వినతి పత్రాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని బీసీ కుల సంఘాలు, ఇతర కుల సంఘాల వారు స్థానిక సంస్థల వారీగా వినతి పత్రాలు ఇవ్వడంతోపాటు తమ సలహాలు, సూచనలు చేయాలని కోరారు.

బాలలం.. రేపటి పౌరులం



రామన్నపేట మండలం పల్లివాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు, టీచర్లు

మత్స్యగిరీశుడికి విశేషారాధనలు

వలిగొండ: మండలంలోని వెంకటాపురంలోగల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

భువనగిరి టౌన్: వికారాబాద్ జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర ఉద్యోగులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, ఔట్ సోర్సింగ్, డ్రైవర్స్ అసోసియేషన్, టీజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ గురువారం మధ్యాహ్నం భువనగిరి కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ మందాడి ఉపేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ధరణికోట భగత్ మాట్లాడుతూ ఉన్నతాధికారులు, ఉద్యోగులపై జరిగిన దాడి అమానుషమన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్, ఆర్డీఓ కృష్ణారెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ ప్రసాద్, కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, ఆయా సంఘాల ప్రతినిధులు గడసందుల మధుసూదన్, శశికాంత్‌గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, కవిత, శ్రీనివాస్, సురేష్, దేశ్యా నాయక్, కౌశిక్ మోహన్ రెడ్డి, గద్దం బాల్‌రెడ్డి కుమార్, డాక్టర్ చైతన్య, చంద్రారెడ్డి, రమేష్, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు!

- ఈ కేసులో ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలే ఎక్కువ
- విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- కోదాడ, భువనగిరి మాజీ ఎమ్మెల్యేలకు కూడా నోటీసులు ఇస్తారంటూ చర్చ
- మరికొందరు నాయకుల పేర్లు ఉన్నాయని ఊహాగానాలు
- గతంలో ఇక్కడి పోలీసులను విచారించిన దర్యాప్తు సంస్థ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నల్లగొండ జిల్లాలో ప్రకంపనలు రేపుతోంది. ఉమ్మడి జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేల పేర్లు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తుండటం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఇప్పటికే నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసులు ఇవ్వడంతో ఆయన గురువారం విచారణకు హాజరయ్యారు. కోదాడ, భువనగిరి మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, పైళ్ల శేఖర్‌రెడ్డికి కూడా నోటీసులు ఇవ్వబోతున్నారన్న చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే జిల్లాకు చెందిన ముగ్గురు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లను ఐదు నెలల కిందటే దర్యాప్తు బృందం విచారించింది.



విచారణకు హాజరవుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

మునుగోడు ఉప ఎన్నిక సమయంలోనే..

2022లో జరిగిన మునుగోడు ఉప ఎన్నికలను తమ పార్టీ పాలనకు రెఫరెండంగా భావించిన బీఆర్ఎస్ పార్టీ ఆ ఎన్నికను సవాల్‌గా తీసుకుంది. బీజేపీ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బరిలో ఉండగా బీఆర్ఎస్ పార్టీ తన అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని గెలిపించుకునేందుకు పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చింది. అప్పుడు కాంగ్రెస్ పార్టీ పెద్దగా దృష్టి సారించకపోయినా బీజేపీ, బీఆర్ఎస్‌లే సవాలుగా తీసుకున్నాయి. బీజేపీ నుంచి జాతీయ నేతలతో పాటు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు కూడా ఉప ఎన్నికల్లో ప్రచారం చేయగా, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభలో పాల్గొన్నారు. మిగతా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనాయకులు మండలాలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరించారు. ఈ ఎన్నిక సమయంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి.

తిరుపతన్నతో మాట్లాడిన కారణంగా..

పోలీసు అధికారి తిరుపతన్న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో పనిచేశారు. ఆ సందర్భంలోనే జిల్లా నేతలతో సంబంధాలు ఏర్పడ్డాయి. తిరుపతన్నతో చిరుమర్తి లింగయ్య మాట్లాడినట్లు ఫోన్ సంభాషణలు ఉండటంతో ఆయనకు నోటీసులు జారీచేశారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఇద్దరి ఫోన్ నంబర్లను చిరుమర్తి లింగయ్య తిరుపతన్నకు ఇచ్చినట్లుగా పోలీసులు భావించి, వాటిని ట్యాప్ చేశారేమోనన్న అనుమానంతో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీచేసినట్లు తెలిసింది. గురువారం పోలీసులు ముందు హాజరైన చిరుమర్తి లింగయ్య.. తనకు తిరుపతన్న తెలిసిన పోలీసు అధికారి అయినందున మాట్లాడి ఉండవచ్చని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడాల్సిన అవసరం తమకు లేదని, కేవలం రాజకీయ కక్షతోనే తనకు నోటీసులు జారీచేసినట్లు లింగయ్య తన సన్నిహితుల వద్ద పేర్కొన్నట్లు తెలిసింది.

ప్రత్యర్థి పార్టీల నేతల కదలికలపై..

మునుగోడు ఉప ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీల నేతల కదలికలను తెలుసుకునేందుకు ఫోన్ ట్యాపింగ్‌కు చేశారని, ప్రత్యర్థి పార్టీలకు డబ్బు అందకుండా కట్టడి చేశారన్న ఆరోపణలు వచ్చాయి. మరోవైపు పోలీసుల ఎస్కార్ట్‌తో ఉప ఎన్నికల్లో వారం రోజుల పాటు డబ్బును ఓ రాజకీయ పార్టీ తరలించిందన్న విషయంలో వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో పాత్ర ఉందన్న అభియోగంపై.. జిల్లాలో పనిచేసిన స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అదనపు ఎస్పీ తిరుపతన్నను అదుపులోకి తీసుకున్న దర్యాప్తు బృందం ముగ్గురు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబు ళ్లను కూడా విచారించింది. తిరుపతన్నతో ఫోన్‌లో మాట్లాడిన సంభాషణలు ఉండటంతో ఇప్పుడు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను విచారణకు హాజరు కావాలని దర్యాప్తు బృందం ఈ నెల 9న నోటీసులు జారీ చేసింది. ఆయన గురువారం పోలీసుల ఎదుట హాజరయ్యారు. కోదాడ, భువనగిరి మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, పైళ్ల శేఖర్‌రెడ్డితో పాటు మరికొంత మంది మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇస్తారనే చర్చ జరుగుతోంది.

హెల్త్ సైన్సెస్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంపు

భువనగిరి: జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అలైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10, బీసీ–ఏ 7, బీసీ–బి 10, బీసీ–సీ 1, బీసీ–డీ 7, బీసీ–ఈ 4, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ట్యూషన్ ఫీజు కింద సంవత్సరానికి రూ.6 వేలు చెల్లించాలని తెలిపారు. బైపీసీ లేదా ఎంపీసీ గ్రూపు చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. రెండేళ్లల డిప్లొమా కోర్సు కోసం యాదాద్రి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నిషియన్ కోర్సులో 30 సీట్లు, డిప్లొమా ఇన్ ఈసీజీలో 30 సీట్లు ఉన్నాయని తెలిపారు. కోర్సు కోసం దరఖాస్తులను పారామెడికల్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 20లోపు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అందజేయాలని తెలిపారు. ఈ నెల 25న అభ్యర్థులను ఎంపిక చేసి డిసెంబర్ 2 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 040–24653519ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం


రేణుక

హుజూర్‌నగర్‌రూరల్‌: తన భార్య కనిపించడంలేదని ఓ వ్యక్తి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన కారింగుల సందీప్‌కు మఠంపల్లి మండలం బక్కమంతులగూడెం గ్రామానికి చెందిన వల్లపుదాసు రేణుకతో 10 నెలల క్రితం వివాహం జరిగింది. ఆగస్టు 13వ తేదీన రేణుక తన అత్తమామలతో కలిసి పొలం పనులకు వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భోజనం తీసుకురావడానికి రేణుక పొలం నుంచి ఇంటికి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించలేదు. ఎంత వెతికినా రేణుక ఆచూకీ లభించలేదు. కాగా బక్కమంతులగూడెం గ్రామానికి చెందిన పాట్టీవంగు కిషోర్‌ తన భార్యను కిడ్నాప్‌ చేశాడని రేణుక భర్త సందీప్‌ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్టు కొమ్మ మీద పడి వ్యక్తి మృతి


కొండయ్య (ఫైల్‌)

కోదాడరూరల్‌: ప్రమాదవశాత్తు చెట్టు కొమ్మ మీద పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండలం గణపవరం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన జక్కంపూడి కొండయ్య(52) మిషన్‌తో చెట్లు కోస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం గ్రామంలోని ఓ చింతచెట్టు ఎక్కి మిషన్‌ సహాయంతో కొమ్మలు కోస్తున్నాడు. ఓ కొమ్మ సగానికి పైగా తెగి కిందకు వేలాడింది. దీంతో కొండయ్య కొమ్మను పూర్తిగా కొయ్యకుండా తాడు సహాయంతో లాగుదామని చెట్టు దిగి కోత మిషన్‌తో పాటు సామగ్రిని పక్కకు పెడుతున్న సమయంలో ఆ కొమ్మ వచ్చి అతడి తల మీద పడింది. దీంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కోదాడ రూరల్‌ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


అంజయ్య (ఫైల్‌)

అడ్డగూడూరు: టీవీఎస్‌ మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తి మరో వ్యక్తిని ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామ స్టేజీ వద్ద గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులుతెలిపిన వివరాల ప్రకారం.. చిర్రగూడూరు గ్రామానికి చెందిన కమ్మంపాటి అంజయ్య(57) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం టీవీఎస్‌ మోపెడ్‌పై అంజయ్య తన భార్య పున్నమ్మతో కలిసి శాలిగౌరారం మండలంలోని తన చిన్న కుమార్తె వద్దకు వెళ్లి సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. చిర్రగూడూరు గ్రామ స్టేజీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాల లైట్‌ ఫోకస్‌కు సరిగ్గా కనిపించక వలిగొండ–తొర్రూర్‌ రహదారిపై రోడ్డు పనులు చేస్తున్న వ్యక్తిని అంజయ్య మోపెడ్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అంజయ్య కిందపడగా.. అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అంజయ్య భార్య పున్నమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డు పనులు చేస్తున్న వ్యక్తికి కూడా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అంజయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య పున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

క్రీడల్లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌ హనుమంతరావు
- ముగిసిన 10వ జోనల్‌ స్థాయి క్రీడా పోటీలు


రాజాపేట: బహుమతులు అందజేస్తున్న యాదాద్రి కలెక్టర్‌ హనుమంతరావు


డిండి: డిండి జట్టుకు ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ అందజేస్తున్న ఆర్డీఓ రమణారెడ్డి

రాజాపేట: విద్యార్థులు క్రీడల్లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌ ఎం. హనుమంతరావు అన్నారు. రాజాపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 10వ జోనల్‌ స్థాయి క్రీడా పోటీలు గు రువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి కలెక్టర్‌ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బ హుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ సుధాకర్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాజు, జోనల్‌ ఆఫీసర్‌ విద్యారాణి, డీసీఓ జగదీశ్వర్‌ రెడ్డి, క్రీడల సమన్వయకర్త జీ. శ్రీనివాస్‌, పీడీ వెంకటేశ్వర్లు, జీపీపీ శోభరాణి, పీఈటీ శృతి పాల్గొన్నారు.

డిండి మండల కేంద్రంలో..

డిండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికలు) పాఠశాలలో నిర్వహిస్తున్న జోనల్‌ స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. స్పోర్ట్స్‌ మీట్‌లో ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ను డిండి గురుకుల పాఠశాల కైవసం చేసుకుంది. కార్యక్రమంలో తహసీల్దార్‌ ఆంజనేయులు, ప్రిన్సిపాల్‌ శిరీష, క్రీడల ఇన్‌చార్జిలు జ్యోతిర్మయి, శ్రీదేవి, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ, ఓ్యతి, నాగలక్ష్మి, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో దూసుకెళ్లాలి..

నడిగూడెం: లక్ష్య సాధనలో గురుకుల విద్యార్థులు దూసుకెళ్లాలని కోదాడ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు నలమాద పద్మావతి, మందుల సామేలు అన్నారు. నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జోనల్‌ స్పోర్ట్స్‌ మీట్‌ గురువారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జోనల్‌ ఆఫీసర్‌ విద్యారాణి, డీసీఓ విద్యాసాగర్‌, ప్రిన్సిపాల్‌ సీహెచ్‌. వాణి తదితరులు పాల్గొన్నారు.


నడిగూడెం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న కోదాడ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు పద్మావతి, సామేలు

మృతదేహంతో బంధువుల ఆందోళన

చింతపల్లి: మండల పరిధిలోని ధైర్యపురి తండాలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. తండాకు చెందిన వాంకుడోత్‌ రోజా(25) అదే తండాకు చెందిన కళ్యాణ్‌ అనే వ్యక్తితో కలిసి గత నెల 26వ తేదీన వరంగల్‌కు పారిపోయింది. వారిద్దరిని తండా పెద్దలు పిలిపించి రోజాకు నచ్చచెప్పి ఆమె భర్తతో పంపించగా.. కళ్యాణ్‌ తల్లిదండ్రులు రోజాను సూటిపోటి మాటలతో వేధించడంతో గత నెల 30వ తేదీన ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేదీన మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రోజా కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్‌ చేస్తూ గురువారం కళ్యాణ్‌ ఇంటి ముందు రోజా మృతదేహాన్ని ఉంచి బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో తండాలో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు తండాకు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా.. వారు వినకపోవడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. తండా పెద్దల సమక్షంలో రోజా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం

చౌటుప్పల్‌ రూరల్‌: చౌటుప్పల్‌ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రానికి చెందిన అబ్దుల్‌ ఖాదర్‌ చౌటుప్పల్‌ మండలం అంకిరెడ్డిగూడెంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 7వ తేదీన అబ్దుల్‌ ఖాదర్‌ పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా చిన్న గాయమైంది. ప్రిన్సిపాల్‌ వెంటనే అబ్దుల్‌ ఖాదర్‌ను చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తీసుకెళ్లి.. అతడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అబ్దుల్‌ ఖాదర్‌ తల్లి వచ్చి అతడిని చిట్యాలకు తీసుకెళ్లింది. గాయం నయమవ్వడంతో బుధవారం పాఠశాలకు వెళ్తానని చెప్పడంతో అబ్దుల్‌ ఖాదర్‌ను పాఠశాలకు పంపించారు. తమ కుమారుడు పాఠశాలకు వచ్చాడా తల్లి ప్రిన్సిపాల్‌కు ఫోన్‌ చేయగా.. రాలేదని ప్రిన్సిపాల్‌ చెప్పారు. ఎంత వెతికినా అబ్దుల్‌ ఖాదర్‌ ఆచూకీ లభించకపోవడంతో గురువారం చౌటుప్పల్‌ పోలీస్‌ స్టేషన్‌లో అతడి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్‌ తెలిపారు.

రైతులే పరిశోధకులుగా మారాలి

- పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య


మాట్లాడుతున్న వనజీవి రామయ్య

ఆత్మకూర్‌(ఎస్‌): రైతులు ఎప్పటికప్పుడు తమ సాగు పద్ధతులను మార్చుకుని పరిశోధకులుగా మారాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య అన్నారు. గురువారం ఆత్మకూర్‌(ఎస్‌) మండల కేంద్రంలో నూజివీడు సీడ్స్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్త రకం వరి విత్తనం ఎన్‌పి.9359–9 సంధ్య క్షేత్ర ప్రదర్శనకు ఆయన తన భార్య జానమ్మతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తమ సాగు పద్ధతులను ఎప్పటికప్పుడు ఆధునికరించుకోవాలని అన్నారు. అధిక దిగుబడి, చీడపీడలను తట్టుకునే విత్తనాలను ఎంచుకొని అధిక లాభాలు పొందాలని సూచించారు. తాను ఎక్కడికి వెళ్లినా చెట్ల పెంపకం గురించి మాట్లాడుతానని, ఇప్పుడు వరి పెంపకం గురించి మాట్లాడుతున్నానని అన్నారు. ఏ కంపెనీ ఏది చెప్పినా రైతులు క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా సాగు చేసి దిగుబడులు పెంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూజివీడు సీడ్స్‌ కంపెనీ నేషనల్‌ సేల్స్‌ మేనేజర్‌ కే. ప్రవీణ్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌ రీజినల్‌ మేనేజర్‌ రాములు, టీం లీడర్‌ నాగయ్య, సీహెచ్‌. నాగరాజు, వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టాటా ఏస్‌.. ఇద్దరికి గాయాలు

మునగాల: విజయవాడ–హైదరాబాద్‌ జాతీయ రహదారిపై మునగాల మండలం తాడువాయి గ్రామ స్టేజీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం మాధవరం గ్రామానికి చెందిన మోర ఉపేందర్‌, హసన్‌ జానీ ద్విచక్ర వాహనంపై మునగాల నుంచి కోదాడ వైపు వెళ్తుండగా.. తాడువాయి గ్రామ స్టేజీ వద్ద ఎదురుగా వచ్చిన టాటా ఏస్‌ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపేందర్‌, హసన్‌ జానీకి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. హసన్‌ జానీ పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌ తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హాకీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు తృతీయ స్థానం


బాలికల జట్టును అభినందిస్తున్న స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ బాధ్యులు

నల్లగొండ టూటౌన్‌: నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన 68వ స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో అండర్‌–17 బాలికల విభాగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు తృతీయ స్థానం దక్కింది. జిల్లా జట్టు తరఫున ఉత్తమ ప్రతిభ కనబరిచిన నల్లగొండ జిల్లా అప్పాజిపేట జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థిని ధరణి, యాదాద్రి భువనగిరి జిల్లా తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థిని ఝాన్సీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హాకీ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్‌ కరీం తెలిపారు. తృతీయ స్థానం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టును నల్లగొండ డీఈఓ భిక్షపతి, ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి విమల తదితరులు అభినందించారు.

సర్వారం పీఏసీఎస్‌ పాలకవర్గం రద్దు

గరిడేపల్లి: మండలంలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాన్ని రద్దు చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సర్వారం పీఏసీఎస్‌లో ఏడుగురు డైరెక్టర్లు రాజీనామా చేయడంతో ఈ నెల 6వ తేదీన జరగాల్సిన సమావేశాన్ని రద్దు చేశామని, డైరెక్టర్ల రాజీనామాను ఆమోదించి సర్వారం పీఏసీఎస్‌కు ఆరునెలల పాటు పర్సన్‌ ఇన్‌చార్జి కమిటీని నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పర్సన్‌ ఇన్‌చార్జిగా అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ జి. కమలకు, నేరేడుచర్ల సహకార బ్యాంకు మేనేజర్‌ సతీష్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పడవ ప్రయాణం.. తప్పిన ప్రమాదం

- బీబీనగర్‌ చెరువులో కొట్టుకుపోయిన పడవ
- 12 మంది మహిళలు, చిన్నారులను కాపాడిన స్థానికులు


పడవను ఒడ్డుకు చేర్చుతున్న స్థానికులు

బీబీనగర్‌: సరదాగా చెరువు ఒడ్డున ఉన్న పడవలోకి ఎక్కిన మహిళలు.. పడవతో సహా చెరువులోకి కొట్టుకెళ్తుండగా స్థానికులు కాపాడారు. బీబీనగర్‌ మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం హైదరాబాద్‌ నుంచి బీబీనగర్‌లో తమ బంధువుల ఇంటికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన 12మంది ముస్లిం మహిళలు, బాలికలు కలిసి సరదాగా గడిపేందుకు బీబీనగర్‌ మండల కేంద్రంలో వరంగల్‌–హైదరాబాద్‌ జాతీయ రహదారి పక్కన గల పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. మత్స్యకారులు చేపల వేట కోసం వాడే పడవ చెరువు ఒడ్డున తాడుతో కట్టి ఉండటం గమనించిన మహిళలు అందులో ఎక్కి కుర్చోగా.. గాలికి పడవ అటూఇటూ ఊగడంతో చెట్టుకు కట్టివున్న తాడు తెగి పడవ చెరువులోకి వెళ్లింది. గాలి ఎక్కువగా వీయడంతో పడవ మరింత లోపలికి వెళ్తుండగా అందులోని మహిళలు భయభ్రాంతులకు గురై కేకలు వేయడంతో హైవే వెంట వెళ్తున్న వారు గమనించి చెరువులోకి దిగి పడవను ఒడ్డుకు చేర్చారు. దీంతో మహిళలంతా ఊపిరి పీల్చుకున్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికురాలి నెక్లెస్‌ చోరీకి యత్నం

- మహిళా దొంగలను పట్టుకున్న ప్రయాణికులు

భువనగిరి క్రైం: భువనగిరి బస్టాండ్‌లో ప్రయాణికురాలి బ్యాగు నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేసి పారిపోతున్న మహిళా దొంగలను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం జరిగింది. మోటకొండూరు మండలం తేర్యాల గ్రామానికి చెందిన పంజీల జ్యోతి భువనగిరిలో వివాహానికి హాజరై తిరిగి గ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకుంది. అప్పటికే బస్టాండ్‌లో కాపుగాసిన మహారాష్ట్రకు చెందిన మితు లోండే స్వప్న, సంజన ఖ్లిపాల్‌ షాండే, గుంజనా రోషన్‌ కలిసి జ్యోతి బ్యాగులోని రూ.1.80లక్షల విలువైన బంగారు నెక్లెస్‌ను చోరీ చేశారు. జ్యోతి వెంటనే తన నెక్లెస్‌ పోయినట్లు గ్రహించి పరిసరాల్లో వెతుకుతుండగా.. అప్పటికే పారిపోతున్న మహిళా దొంగల ముఠాను ప్రయాణికులు, స్థానికులు వెంబడించి స్థానిక ప్రిన్స్‌ చౌరస్తా వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు దొంగల ముఠాను విచారించగా.. వారి వద్ద బంగారు నెక్లెస్‌ లభించింది. కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ సీఐ సురేశ్‌కుమార్‌ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

చివ్వెంల(సూర్యాపేట): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్‌. గోవర్ధన్‌రెడ్డి గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం గుంటూరు జిల్లా కారంపూడి మండలం పేట సన్నిగండ్ల గ్రామానికి చెందిన వెన్నపూసల శివయ్య, ఆత్మకూరి నరేష్‌ కారంపూడిలో గల లక్ష్మీ గణపతి ఆటో ఫైనాన్స్‌ నందు రికవరీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాకు చెందిన పలువురు ఫైనాన్స్‌ తీసుకుని కిస్తీలు చెల్లించకపోవడంతో వారి నుంచి డబ్బు రికవరీ చేసేందుకు శివయ్య, నరేష్‌ 2017 మే నెలలో నల్లగొండకు వచ్చారు. అక్కడ నాలుగు రోజులు ఉన్న తర్వాత సూర్యాపేటకు వచ్చారు. 2017 మే 13వ తేదీన సూర్యాపేటలోని శ్రీరామ్‌నగర్‌లో గల తమ బ్రాంచ్‌ ఆఫీస్‌ మేనేజర్‌ అస్లాం, మధుతో కలిసి హోటల్‌లో భోజనం చేసి వెళ్తుండగా.. తమ వద్ద ఆటో ఫైనాన్స్‌ తీసుకుని కిస్తీ చెల్లించకుండా తిరుగుతున్న ఆత్మకూర్‌(ఎస్‌) మండలం కందగట్ల గ్రామానికి చెందిన జెట్టి లింగయ్య కనిపించడంతో అతడిని ఆపి ఆటోను సీజ్‌ చేసి సమీపంలో ఉన్న యాకూబ్‌ గ్యారేజీలో పెట్టి ఆఫీస్‌కు వెళ్లారు. కోపోద్రిక్తుడైన లింగయ్య ఫైనాన్స్‌ ఆఫీస్‌కు వెళ్లి తన ఆటో ఎక్కడ ఉంచారో చూపించాలని శివయ్య, నరేష్‌తో గొడవపడ్డాడు. దీంతో నరేష్‌, శివయ్య యాకూబ్‌ గ్యారేజీ వద్దకు లింగయ్యను తీసుకెళ్లి ఆటోను చూపించి తిరిగి ఆఫీస్‌కు వెళ్తుండగా.. లింగయ్య మళ్లీ వారితో ఘర్షణకు దిగాడు. శివయ్య తాను లింగయ్యతో మాట్లాడి వస్తానని చెప్పి నరేష్‌ను అక్కడ నుంచి వెళ్లిపొమ్మన్నాడు. శివయ్య, లింగయ్య వాదించుకుంటూ యాకూబ్‌ గ్యారేజీ సమీపంలో ఉన్న మమతా బార్‌ వరకు వెళ్లారు. అప్పటికే తనతో తెచ్చుకున్న కత్తితో లింగయ్య శివయ్య కడుపులో పొడిచాడు. భయంతో శివయ్య పరుగెత్తుతుండగా లింగయ్య అతడిని వెంబడించి మరీ పొట్టలో, ఛాతిపై పొడిచి పరారయ్యాడు. ఇది గమనించిన నరేష్‌ ఆఫీస్‌ వద్దకు వెళ్లి బ్రాంచ్‌ మేనేజర్‌ అస్లాం, అక్కడ పనిచేస్తున్న మధుకు విషయం చెప్పి ఘటనా స్థలానికి తీసుకెళ్లాడు. శివయ్యను బైక్‌పై ఓ ప్రైవేట్‌ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సూర్యాపేట డీఎస్పీ సునీతామోహన్‌ ఆదేశాల మేరకు అప్పటి సీఐ మొగులయ్య కేసు నమోదు చేసి లింగయ్యను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా పలువురు సాక్షులను విచారించిన సూర్యాపేట జిల్లా న్యాయమూర్తి ఎస్‌. గోవర్ధన్‌రెడ్డి గురువారం పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ కొంపల్లి లింగయ్య వాదనలతో ఏకీభవిస్తూ లింగయ్యకు జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌కు లైజన్‌ ఆఫీసర్‌ సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్‌ అవిలేష్‌ సహకరించారు.

భవనం పైనుంచి జారిపడి వలస కార్మికుడి మృతి


క్రాంతి మృతదేహం

భూదాన్‌పోచంపల్లి: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారి పడి వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన గుంజి శివకుమారి భర్త చనిపోవడంతో బతుకుదెరువు కోసం ఆమె తన ఇద్దరు కుమారులను తీసుకొని ఆరేళ్ల క్రితం బీబీనగర్‌కు వలస వచ్చింది. వీరు చుట్టుపక్కల గ్రామాల్లో భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన కోతులారం శ్రీకాంత్‌ నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి ప్లాస్టరింగ్‌ చేయడానికి శివకుమారి పెద్దకుమారుడు గుంజి క్రాంతి(29) వచ్చాడు. గోవా కర్రల పైకి ఎక్కి భవనానికి ప్లాస్టరింగ్‌ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద ఉన్న బేస్‌మెంట్‌ రాయిపై పడ్డాడు. ఈ ప్రమాదంలో క్రాంతికి కణత భాగంలో గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే అక్కడే పనిచేస్తున్న తోటి కార్మికులు గమనించి గుత్తేదారు మేస్త్రీ శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె. భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఫుడ్‌ సేఫ్టీ అధికారుల తనిఖీలు

- పలు హోటళ్లకు నోటీసులు


హోటళ్లలో తనిఖీలు చేస్తున్న ఫుడ్‌ సేఫ్టీ అధికారులు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఫుడ్‌ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర ఫుడ్‌ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్‌ టీం హెడ్‌, జోనల్‌ అసిస్టెంట్‌ ఫుడ్‌ కంట్రోలర్‌ వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, పి. స్వాతి, శిరీషతో కూడిన బృందం సూర్యాపేట పట్టణంలోని ఎలీఎస్‌ బేకరీ, కావేరి గ్రాండ్‌ హోటల్‌, తనూస్‌ లోగిలి హోటల్‌, డాల్ఫిన్‌ బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ హోటళ్లలో వంట గదులు అపరిశుభ్రంగా ఉండడం, రిఫ్రిజిరేటర్‌లో ఫుడ్‌ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం సరైన ఉష్ణోగ్రతలు లేకపోవడం, నిల్వ చేసిన కుళ్లిన మాంసం, చేపల ఉత్పత్తులు, హానికర రంగులు కలిపిన చికెన్‌ గుర్తించారు. ఈ హోటళ్ల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు.

గ్రామాల్లో డ్రోన్‌ సేవలను విస్తరింపజేస్తాం

- ఎయిమ్స్‌ డైరెక్టర్‌ వికాస్‌ భాటియా


మాట్లాడుతున్న ఎయిమ్స్‌ డైరెక్టర్‌ వికాస్‌ భాటియా

బీబీనగర్‌: మారుమూల గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోని క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించేందుకు డ్రోన్‌ సేవలు విస్తరింపజేయనున్నట్లు ఎయిమ్స్‌ డైరెక్టర్‌ వికాస్‌ భాటియా తెలిపారు. బీబీనగర్‌ మండలం కొండమడుగు పీహెచ్‌సీలో టీబీ నమూనాల సేకరణకు సంబంధించి డ్రోన్‌ సేవలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొండమడుగు, బొమ్మలరామారం, బొల్లేపల్లి, వర్కట్‌పల్లి, మునిపంపుల, భువనగిరి, రామన్నపేట పీహెచ్‌సీల పరిధిలో డ్రోన్‌ సేవలు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్‌ ద్వారా ఇప్పటి వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని 54 సబ్‌ సెంటర్లు, 108 గ్రామాల నుంచి 900 క్షయ వ్యాధిగ్రస్తుల నుంచి శాంపిల్స్‌ రవాణా చేసి తిరిగి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీన్‌ అకడమిక్‌ ప్రొఫెసర్‌ రాహుల్‌ నారంగ్‌, మెడికల్‌ సూపరింటెండెంట్‌ అభిషేక్‌ అరోరా, డిప్యూటీ డైరెక్టర్‌ బిపిన్‌ పి వర్గీస్‌, ఐసీఎంఆర్‌ ప్రోగ్రాం ప్రతినిధులు కుల్దీప్‌ నిగమ్‌, సిమ్మీ, జిల్లా క్షయ వ్యాధి అధికారి సాయిశోభ, పీహెచ్‌సీ వైద్యుడు సర్వన్‌కుమార్‌ పాల్గొన్నారు.

స్నేహితురాలి వివాహానికి వచ్చి అనంతలోకాలకు..

- కాల్వలో ఈతకు వెళ్లి నీట మునిగి మృతిచెందిన యువకుడు

మర్రిగూడ: స్నేహితురాలి వివాహానికి వచ్చిన యువకుడు కాల్వలో ఈతకు వెళ్లి నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన మర్రిగూడ మండలం కొండూరులో గురువారం జరిగింది. ఎస్‌ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌ జిల్లా కేంద్రంలోని కస్తూరి కాలనీకి చెందిన పిట్టల బాలచందర్‌(25) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్నాడు. తనతో పాటు పనిచేస్తున్న మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లికి చెందిన తన స్నేహితురాలి వివాహానికి హాజరయ్యేందుకు బాలచందర్‌తో పాటు మరికొందరు స్నేహితులు కలిసి బుధవారం రాంరెడ్డిపల్లి గ్రామానికి చేరుకున్నాడు. గురువారం వివాహం ఉండగా.. ఉదయం బాలచందర్‌తో పాటు ఐదుగురు స్నేహితులు కలిసి కొండూరు గ్రామ సమీపంలో గల కాల్వలో స్నానాలు చేసేందుకు వెళ్లారు. కాల్వలో స్నానం చేస్తుండగా బాలచందర్‌ నీటిలో మునిగిపోయాడు. అతడితో పాటు వచ్చిన స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఎవరికీ ఈత రాకపోవడంతో మర్రిగూడ చౌరస్తాకు వచ్చి స్థానికులను తీసుకెళ్లే లోపు బాలచందర్‌ నీట మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి తండ్రి పిట్టల సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో కార్తీక పూజలు


ఉత్తర మాడ వీధిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కుతున్న మహిళా భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గురువారం భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్నారు. కొండ పైన స్వామివారి ఆలయ ఉత్తర మాడ వీధిలో, శివాలయంలో కార్తీక దీపారాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దీపారాధన పూజల్లో పాల్గొన్నారు.

నేడు వ్రత పూజ సమయాల్లో మార్పులు..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో మార్పులు చేశారు. ప్రస్తుతం కార్తీక మాసమంతా ప్రతి రోజు 6 బ్యాచ్‌లుగా భక్తులచే వ్రతాలు నిర్వహిస్తుండగా.. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ఎనిమిది బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించేలా ఆలయాధికారులు మార్పులు చేశారు. మొదటి బ్యాచ్‌ ఉదయం 5.30గంటలకు, రెండో బ్యాచ్‌ 7.30గంటలకు, మూడో బ్యాచ్‌ 9.30గంటలకు, నాల్గో బ్యాచ్‌ 11.30గంటలకు, ఐదో బ్యాచ్‌ మధ్యాహ్నం 1.30గంటలకు, 6వ బ్యాచ్‌ 3.30గంటలకు, ఏడో బ్యాచ్‌ సాయంత్రం 5.30గంటలకు, ఎనిమిదో బ్యాచ్‌ సాయంత్రం 7గంటలకు సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నారు.

శివాలయంలో ఆకాశ దీపారాధన..

అదేవిధంగా శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు యాదగిరీశుడి క్షేత్రంతో పాటు అనుబంధంగా కొండపైన కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆకాశ దీపారాధన పూజలు జరిపించనున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయంలో సామూహిక దీపోత్సవం వేడుకను సైతం జరిపించనున్నారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న ఇంటలిజెన్స్‌ డీజీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర ఇంటలిజెన్స్‌ డీజీ శివధర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు నిర్వహించిన అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. శివధర్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.


శివధర్‌రెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఈఓ